క్లుప్తంగా

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌టౌన్ సబ్ డివిజన్ పరిధిలోని ఆదిలాబాద్ రూరల్, మావల, నార్త్, సౌత్, టౌన్-3 సెక్షన్లలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని మావల ఏఈ జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మావల సెక్షన్ దస్నాపూర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయండి

బోథ్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో రమేశ్ వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ముసాయిదా, ఓటరు లిస్టు, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి వివరాలను వివరించారు. కాగా జీడిపల్లె గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

బేల: మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోమవారం గత నాలుగేళ్లు పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రిన్సిపాల్ వరప్రసాద్‌రావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ఫీజులు తీసుకునే పరిస్థితి లేక అటూ.. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ గేడం ప్రవీణ్, ఐసీసీ చైర్మన్ పుష్ప, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ మేళా

జైనథ్: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం జైనథ్ ఉమ్మడి మండలాలకు సంబంధించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రాథమిక స్థాయిలో అభ్యసనను మెరుగుపరిచే ఆలోచనతో కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు తయారుచేసిన పరికరాలతో విద్యార్థులకు సులభతరంగా విద్యను బోధించవచ్చని తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు బాపూరావు, సూతల రవీందర్ రెడ్డి, నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవం

సాత్నాల: మండలంలోని జామిని ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల నిర్వహణ, ఆట పాటలతో బోధన చేశారు. ప్రతిభ కనబరిచిన చిన్నారి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ యాదవ్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు జ్యోతి, జయశ్రీ, లక్ష్మ ణ్, పెంటపర్తి ఉషన్న, గంగన్న, మునహిద్, పోచ్చిరాం పాల్గొన్నారు.

యువతకు స్వయం ఉపాధి కల్పించాలి

భీంపూర్: మండలంలోని అర్హులైన యువకులకు రాజీవ్ యువ వికాసం ద్వారా స్వయం ఉపాధి కల్పించాలని ఎంపీడీవో గోపాల కృష్ణారెడ్డిని బీజేపీ మండల అధ్యక్షుడు అంకం అశోక్ స్థానిక నాయకులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. దరఖాస్తు చేసుకొని మూడు నెలలు గడుస్తున్నా.. ఒక్కరికీ స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపు యువకులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నారాయణ, వెంకటేశ్, భోజన్న, సంజీవ్ హనుమండ్లు, బెరు, సాంబాజీ, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన బైరి విలాస్ కుటుంబానికి గ్రామ యూత్ సభ్యులు సోమవారం రూ. 60,633 నగదు అందించారు. వ్యవసాయ కూలీగా పనిచేసే బైరి విలాస్ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబం అపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. యూత్ సభ్యులు విలాస్ తల్లి రాధబాయి నగదు అందించారు.

10 నుంచి ఎన్‌సీసీ శిబిరం

ఆదిలాబాద్: 32 తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో మూడో వార్షిక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఏకే. కిచ్చార్ తెలిపారు. శిబిరంలో 600 మంది కేడెట్లు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆశాజనకంగా సోయా

- కనిపించని తెగుళ్లు, చీడపీడల వ్యాప్తి
- అనుకూలంగా వాతావరణం
- ప్రస్తుతం కాత దశలో పంట
- దిగుబడిపై రైతుల ఆశలు



తాంసి శివారులో ఏపుగా పెరిగిన సోయా పంట

తాంసి: సోయా పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు దిగుబడిపైనే ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఏపుగా పెరిగి కాత దశలో ఉండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వలన పత్తిలో నీరు నిలిచి దెబ్బతింది. పత్తి పంట పూత, కాత రాలిపోవడంతో పత్తి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కానీ సోయా మాత్రం వర్షాలకు దెబ్బతినకుండా ఏపుగా పెరిగినట్లు కనిపిస్తోంది.

పెరిగిన సాగు విస్తీర్ణం..

మండల వ్యాప్తంగా గత సంవత్సరంలో పోలిస్తే ఈఏడాది కూడా సోయా సాగు విస్తీర్ణం కొంత మేర పెరిగింది. గతేడాది సాగుచేసిన సోయా పంటలో అధికంగా తెగుళ్లు, చీడపీడలు వ్యాప్తి చెంది పలు చోట్ల సరైన దిగుబడి రాని పరిస్థితి కనిపించింది. రబీ సీజన్‌లో రెండో పంటగా జొన్న, మొక్కజొన్న సాగు చేసేందుకు ఈఏడాది ఎక్కువగా సోయా సాగు చేశారు. మండల వ్యాప్తంగా సుమారుగా నాలుగు వేల ఎకరాల్లో సోయా సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో తెగుళ్ల వ్యాప్తి చెందకపోవడం, పురుగు ఉధృతి కనిపించడం లేదు. అలాగే కలుపు కూడా అంతగా లేదు.

ఎకరానికి 7 నుంచి 8 క్వింటాళ్లు..

ప్రస్తుతం కాతతో ఆశాజనకంగా కనిపిస్తున్న సోయా దాదాపుగా ప్రతీ ఎకరానికి 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని రైతులు ఆశలు పెట్టుకున్నారు. సాగు చేసిన మొదటి నుంచి పంటకు ఎలాంటి పురుగు ఉధృతి లేకపోవడంతో పూత, కాత బాగా వచ్చింది. కాత కూడా నిండుగా ఉండడంతో దిగుబడిపై ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది గిట్టుబాటు ధర పెంచుతున్నట్లు ప్రకటించింది. పంట ధర పెరుగడంతో పాటు పంట దిగుబడి కూడా అధికంగా వచ్చే అవకాశం ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు ఎకరాల్లో సాగు



ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో సోయా సాగు చేశాను. ప్రస్తుతం ఏపుగా పెరిగి కనిపిస్తోంది. పూత బాగా రావడంతో ఒకసారి మందు పిచికారీ చేశాను. పంట సాగుకు ఎక్కువగా పెట్టుబడి లేకున్నా బాగానే పెరిగింది. దిగుబడి సైతం ఆశించినంత వచ్చేలా పంట కనిపిస్తుంది.

– గడ్డం సురేందర్ రెడ్డి, రైతు

పంటలు బాగున్నాయి



సోయాతో పాటు పత్తి పంటలకు వాతావరణం అనుకూలంగా ఉంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. వరదలతో దెబ్బతిన్న పంటలను సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందించాం. ప్రస్తుతం ఏపుగా పెరిగి కాతతో నిండుగా కనిపిస్తోంది.

– రవీందర్, మండల వ్యవసాయాధికారి

ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

సాత్నాల: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రజావాణి ఒక వంతెనలా పని చేస్తుందన్నారు. మొత్తం 5 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, వ్యవసాయాధికారి అష్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజా పిర్యాదుల స్వీకరణ ఉంటుందని తహసీల్దార్ శ్యాంసుందర్ ఒక ప్రకటలో తెలిపారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని మండలంలోని ఆయా గ్రామాల్లో సమస్యలు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కలీమ్

నేరడిగొండ: ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ ఎంఏ కలీమ్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్, ఏఈవో సౌజన్య పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని వయోజన విద్య డీడీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్పీఎల్ ఉన్నత పాఠశాలలో ఫోర్టెస్, ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్మార్ట్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయగా సోమవారం ప్రారంభించారు. 5 కంప్యూటర్లు, 5 టేబుళ్లు, 10 కుర్చీలను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేలా స్వచ్ఛంద సంస్థలు కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. ఇందులో ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో సోమయ్య, ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్ట్ ప్రతినిధులు దిగంబర్, సతీశ్ దేశ్‌పాండే, రిటైర్డ్ ఎంఈవో నర్సయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

వందశాతం అక్షరాస్యత జిల్లా లక్ష్యం

పట్టణంలోని కోలిపూర ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ హాజరై మాట్లాడారు. ఆదిలాబాద్‌ను వందశాతం అక్షరాస్యత జిల్లాగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. చదువు రాని తల్లిదండ్రులకు తమ పిల్లలు విద్య నేర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఇందులో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అశోక్, వెంకటరమణ, రవీందర్, దేవన్న, మురళీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బేల: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులం పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు శివరాజ్, కార్తీక్‌లు రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. సోమవారం విద్యార్థులను ప్రిన్సిపాల్ రంగన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నేరడిగొండ: గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. ఆదికర్మయోగి అభియాన్‌లో భాగంగా సోమవారం లింగట్ల గ్రామంలో కమ్యూనిటీ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పనులను గుర్తించి, వనరుల గుర్తింపు ప్రణాళిక (రీసోర్స్ మ్యాపింగ్) తయారు చేశారు., ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో వసంత్ రావ్ ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

బోథ్: లంబాడా, బంజారా, సుగాలి కులాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టులో మాజీ ఎంపీ సోయం బాపూరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కేసు వేసిన నేపథ్యంలో వారి చిత్రపటాలకు సొనాల మండల కేంద్రంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మెస్రం లాలూరాం, జూగునక్ మారుతీ, రాజు, గోవింద రావు పటేల్, జైతు పటేల్, భూమన్న, సుదర్శన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నార్నూర్: మండల కేంద్రానికి చెందినా సిందే రుక్మాబాయి అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్ బాధితురాలు ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. తన వంతు సాయంగా రూ. 5వేలు అందించారు.

అఖండ జ్యోతికి రావాలని ఆహ్వానం

బోథ్: మండలంలోని కన్గుట్ట గ్రామస్తులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండ మండల కేంద్రంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చే అఖండ జ్యోతి కార్యక్రమాన్ని హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, ప్రశాంత్, ఆకుల రాజేందర్, గంగమల్లు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం

నార్నూర్: గాదిగూడ మండలంలోని అర్జుని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఝరి పీహెచ్‌సీ వైద్యాధికారి సంజీవ్ నాయక్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వసతి గృహంలో స్వచ్ఛత పాటించాలన్నారు. శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ ఆడే సంజీవ్, రవీందర్ రాథోడ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేసిన ఎమ్మెల్యే

నేరడిగొండ: ఎంబీబీఎస్ చదువుతున్న మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన ఆడే కైలాష్ కుమారుడు ఆడే రవి కిరణ్‌కు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం ల్యాప్‌టాప్ అందజేశారు. ఐటీడీఏ అధికారులతో సంప్రదించి ల్యాప్‌టాప్ అందజేయడం జరిగిందని తెలిపారు.

నిధులు మంజూరు చేయాలి

సాత్నాల: కోరటా– చనక ప్రాజెక్టు పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు మద్దుల ఉషన్న అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన నేపథ్యంలో, భోరజ్ మండలం కోరటా– చనక ప్రాజెక్టును, బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో మాజీ వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ వేణు గోపాల్ యాదవ్, డైరెక్టర్ బట్టు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై సోమవారం ఆయిల్ డ్రమ్ములతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. రహదారిపై ఆయిల్ పూర్తిగా వ్యాపించింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై ఇమ్రాన్ సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భీంపూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ అన్నారు. మండలంలోని టేకిడిరాంపూర్, కరంజి వైద్య సిబ్బంది సోమవారం పర్యటించారు. దోమలు వృద్ధి చెందకుండా మురికి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో రసాయనాలను పిచికారీ చేశారు. ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం కోరారు. మండల విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె) గ్రామంలో సోమవారం గ్రామస్తులు పంట పొలంలో కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు గాడ్గే మీనాక్షి, గాడ్గే సుభాష్‌లు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం హయాంలోనే రెండు పంటలకు పెట్టుబడి సాయం, 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిందన్నారు. తెలంగాణ ప్రజలు మళ్లీ సారే రావాలని, కేసీఆరే కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

'ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయొద్దు'

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న లంబాడాలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయొద్దని రాజ్ గోండు సేవా సమితి నాయకులు అన్నారు. సోమవారం తహసీల్దార్ జాడి రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు ఆత్రం పరమేశ్వర్ మాట్లాడుతూ.. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లంబాడా, సుగాలీలకు ఎస్టీ ధృవీకరణ పత్రాలు పొంది ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పెందుర్ జగన్నాథ్, మెస్రం శంకర్, కోట్నాక్ దేవీదాస్, ఆర్కా గోవింద్, ఆత్రం భీం రావు, తదిత రులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

కైలాస్‌నగర్: పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.3లక్షల ఆరు వేల విలువైన చెక్కులను సోమవారం తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.

పరామర్శ

నేరడిగొండ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన తేజాపూర్ మాజీ ఎంపీటీసీ అల్లూరి శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పరామర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని గిరిజన భవనంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర నాయకులు గోడం గణేశ్, కుడ్మేత తిరుపతి, కోడప నగేశ్ అధ్యక్షతన తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెందోర్ ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. నాయకులు కండువా కప్పి తుడుందెబ్బలోకి ఆహ్వానించినారు. కార్యక్రమంలో పూర్కా బాపూ రావు, కోవా విజేయ్ కుమర్, పెందోర్ దాదిరావు, ఆడ హన్మంతు, టికం వశంత్ రావ్, గోడం రేణుక బాయి పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలి

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్ సాగునీటి ప్రాజెక్టు దిగువన ఉన్న జవహర్‌నగర్ వాసులకు ప్రభుత్వం ఎగువ ప్రాంతంలో స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పునరావాసం కల్పించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు, ఆదిలాబాద్‌లో ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఆర్డీవో స్రవంతికి వినతిపత్రం అందజేశారు. గత 20 ఏళ్లుగా వర్షాకాలం వచ్చిందంటే వరద నీటితో భయం భయంగా ఉందన్నారు. కార్యక్రమంలో బొమ్మెత నర్సయ్య, బాలే కార్తీక్, బుక ప్రకాష్, అగ్గు నందుకుమార్, త్రియంబక్, దిగంబర్, ఆవుల రాధ, సరస్వతి, శోభ, కల్పన, లక్ష్మి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

ఎమ్మెల్యేను కలిసిన బీఎస్ఎన్ఎల్ మేనేజర్

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గంలోని నెట్‌వర్క్ సమస్యలపై చర్చించేందుకు బీఎస్ఎన్ఎల్ నిజామాబాద్, ఆదిలాబాద్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిశారు. సోమవారం ఆయన బృందం సభ్యులతో కలిసి మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలపై చర్చించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించి గిరిజనులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

విద్యుత్ సరఫరా చేయాలని లేఖ..

బోథ్ మండలంలోని నక్కలవాడ, గొల్లాపూర్, చింతలబోరితో పాటు బజార్‌హత్నూర్ మండలంలోని రాంపూర్, హర్కిహి, నేరడిగొండ మండలంలోని పీచర, కొరటికల్, లింగట్ల గ్రామాల్లోని బీఎస్ఎన్ఎల్ టవర్లకు విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈకు బీఎస్ఎన్ఎల్ అధికారులు లేఖ రాశారు. విద్యుత్ శాఖ ఎస్ఈకి లేఖ ఇవ్వడంతో సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భీంపూర్: మండలంలోని వడూర్ గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వ పథకాలు అందించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగానే స్పందించి త్వరలోనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

బోథ్: మండల కేంద్రంలోని వాగ్దేవి జూనియర్, డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అక్షరాస్యత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. దీన్ని నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఎంఈవో కుమ్మరి పోశెట్టి మాట్లాడుతూ.. అక్షరాస్యత లేకపోవడం వల్ల సమాజంలో అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

నేరడిగొండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నాయకులు హాజరై ఓటరు జాబితాను పరిశీలించారు. రానున్న మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం రూపొందించిన ఓటరు జాబితాను అధికారులు సమావేశంలో ప్రదర్శించారు. లోపాలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో నాయకులు సాబ్లే సంతోష్ సింగ్, ఆడేపు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు తుది జాబితాలో అభ్యంతర స్వీకరణ కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో సత్యానంద్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆయా పార్టీల నాయకుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశమైన ఎంపీడీవో చంద్రశేఖర్

జైనథ్: రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మహేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాకు సంబంధించిన ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం జగదీశ్ రెడ్డి, రాందాస్, గణేష్ యాదవ్, వెంకట్ రెడ్డి, బింగి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆదిలాబాద్‌టౌన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సరస్వతి విద్యాపీఠం ప్రాంత సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి ఖేల్ కూద్ పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సరస్వతి శిశుమందిరాల విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. క్రీడలతో స్నేహభావం పెంపొందడంతో పాటు ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు. సరస్వతి శిశు మందిరాల్లో చదివిన విద్యార్థులు ఒలింపిక్‌లో పతకాలు సాధించారని గుర్తు చేశారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో బజరంగ్‌లాల్ అగర్వాల్, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న శ్రీనివాస్ రావు

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్‌స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 12 వరకు గడువు ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఖుష్బూ గుప్తా, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత అపరాధ రుసుముతో ఈనెల 13 నుంచి 20 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

డెంగీ నియంత్రణకు చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: డెంగీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా మలేరియా నివా రణ అధికారి శ్రీధర్ అన్నారు. పట్టణంలోని హమాలీవాడలోని పలు గృహాలను సోమవారం సందర్శించారు. ప్రజలకు కీటకజనిత వ్యా ధులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇటీవల కాలనీలో ఒకరికి డెంగీ పాజిటీవ్ నిర్ధారణ కాగా, చుట్టుపక్కల ప్రాంతాల్లో స్ప్రే చేయించారు. ఆయన వెంట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యుడు రిహాన్, సిబ్బంది తదితరులున్నారు.

108 సేవలపై సమీక్ష



పీవోను కలిసిన 108 జిల్లా అధికారులు

ఉట్నూర్‌రూరల్: అత్యవసర సమయాల్లో రోగులకు సేవలు అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా 108 అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో 108 అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి జిల్లా 108 ఎమర్జెన్సీ ప్రోగ్రాం మేనేజర్ సమ్రాట్, జిల్లా మేనేజర్ రాజశేఖర్‌లు పాల్గొని ప్రాజెక్ట్ వారీగా పనితీరు నివేదికలను పీవోకు సమర్పించారు. అంబులెన్స్ స్పందన సమయం, వాహనాల లభ్యత, ఉద్యోగావకాశాలపై డేటా సేకరణ వంటి అంశాలపై చర్చించారు.